క్లుప్తంగా

చక్రేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో చక్రేశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మగుడివీధిలో వెలసిన చక్రేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి అభిషేకాలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆకట్టుకున్న మాక్ డ్రిల్


ఆర్టీసీ బస్టాండు వద్ద మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సత్యవేడు: అగ్నిమాపక వారోత్సవాల్లో రెండవ రోజు ఆర్టీసీ బస్టాండు వద్ద నిర్వహించిన మాక్ డ్రిల్(విన్యాసాలు) ప్రజలను ఆకట్టుకున్నాయి. అగ్ని మాపక శాఖకు చెందిన వివిధ రకాల బ్రాంచ్‌లతో ఫైర్ ఆఫీసర్ పి.రాజయ్య ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో లాంగ్ బ్రాంచ్, షార్ట్‌బ్రాంచ్, ట్రిపుల్ పర్పస్ నాజిల్, రివాల్వింగ్ బ్రాంచ్ తదితర పరికరాలతో విన్యాసాలు చేశారు. అనంతరం ప్రజలకు కరపత్రాలతో అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదసమయంలో మంటలు ఎలా ఆర్పాలి? ప్రమాదంలో చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలి? తదితర అంశాలను ప్రదర్శనపూర్వకంగా ఫైర్‌ఆఫీసర్, సిబ్బంది తెలియజేశారు. కార్యక్రమంలో ఎల్‌ఎఫ్‌లు ప్రసాద్, పిచ్చాండి, డీఓపీలు గోవిందరాజులు, జి.సుబ్రమణ్యం, ఎస్. సుబ్రమణ్యం, ఫైర్‌మెన్లు రవికుమార్ , నరేష్, చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు


తనిఖీ చేస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: పట్టణంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం పోలీసుల తనిఖీలు చేపట్టారు. పలు వాహనాలను తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ ఎవరైనా భారీ మొత్తంలో నగదు తీసుకెళుతున్నా అందుకు సంబంధించి పత్రాలు ఉండాలన్నారు. లేకపోతే సీజ్ చేస్తామన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి


రేణిగుంటలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు

రేణిగుంట: ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని రేణిగుంట డీఎల్‌పీవో ప్రభురెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లను చైతన్య పరుస్తూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీగా వినాదాలు చేసుకుంటూ కార్యాలయ సిబ్బంది, అధికార బృందం ఆర్టీసీ బస్టాండు మీదుగా ప్రధాన వీధుల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ ప్రజలకు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు వజ్రాయుధం వంటిదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలని కోరారు. ప్రజలంతా ఓటు వేసేందుకు అవసరమైన స్వేచ్ఛాయుత వాతావరణాన్ని ఎన్నికల నిర్వహణ అధికార యంత్రాంగం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణు చిరంజీవి, తహసీల్దార్ నాగేశ్వరరావు, కార్యాలయ ఏవో హరిబాబు, ఈవోపీఆర్‌డీ అరుణ, పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానిక సీఐ శ్రీరామశ్రీనివాసులు కథనం.. వెంకటగిరికి చెందిన నిశాంత్(25) ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళుతుండగా ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద ముందు వెళ్తున్న లారీని అధిగమించబోయి అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో నిశాంత్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మీ సేవకుడిగా వచ్చా.. ఆశీర్వదించండి

- జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్
- గ్రామాల్లో ప్రచారానికి విశేష స్పందన


తలారివెట్టు ఎస్టీ కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ: మీ సేవకుడిగా వచ్చా.. నన్ను ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సత్యవేడు నియోజక అభ్యర్థి నూకతోటి రాజేష్ అభ్యర్థించారు. సోమవారం ఆయన మండలంలోని తలారివెట్టు, కల్లివెట్టు, వేణుగోపాలపురం , నెలవాయి, వెన్నువరత్తూరు గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు అడుగడుగునా హారతులు పడుతూ, పూలవర్షం కురిపిస్తూ ప్రజలు స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి నవరత్నాల కరపత్రాలతో ఆయన ఓటర్లను కలిశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సంపూర్ణంగా నెరవేర్చారని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి, ఘన విజయాన్ని అందించి, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి అడుగు ప్రజా సంక్షేమం కోసం ముందుకు సాగిందని, ఇలాంటి సంక్షేమ పాలన మళ్లీ కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ప్రజలందరూ ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, తిరుపతి ఎంపీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గురుమూర్తిని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక చంద్రబాబు నెరవేర్చిన దాఖలాలు లేవని, ప్రజలను హామీలతో వంచించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. వైఎస్సార్ సీపీకి పట్టం కడితే సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి, సీనియర్ వైఎస్సార్ సీపీ నేతలు అరణి సుధాకర్‌రెడ్డి, మునిరెడ్డి, సత్యవేడు నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ వేలూరు రాజేష్, సింగిల్ విండో చైర్మన్ హరనాథరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు భానుప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శులు జొన్నల గోపాల్‌రెడ్డి, రవి రెడ్డి, మణినాయుడు, గురునాథం, సురుటుపల్లి దేవస్థానం సభ్యులు అజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ ప్రసాద్, నాయకులు గురవయ్య, హరిబాబు, కోటేశ్వరరావు, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యవేడులో రాజేష్ ప్రచారం

సత్యవేడు: మండలంలో మంగళవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ ఎన్నికల ప్రచారం చేస్తారని పార్టీ మండల కన్వీనర్ కే. సుశీల్ కుమార్ రెడ్డి తెలిపారు. సత్యవేడు పంచాయతీలో ఉదయం 9గంటలకు కోమిటిగుంట, 10:30 దళవాయి అగ్రహారం, 11:30 సత్యవేడు దళితవాడ, మధ్యాహ్నం 3 గంటలకు 3వ సెగ్మెంట్‌లో ప్రచారం చేస్తారని తెలియజేశారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


దివ్యాంగులకు కరపత్రం అందజేస్తున్న రాజేష్

జగనన్నతోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు


ఫ్యాను గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి, బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని ఎంపీ గురుమూర్తి, బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం శ్రీకాళహస్తి మండలం వేడాం, హరిజనవాడ, అరుంధతివాడ, ఎస్టీ కాలనీల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో గత 30 ఏళ్లలో జరగని అభివృద్ధి కేవలం ఐదేళ్లలో జరిగిందన్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హయాంలో గిరిప్రదక్షిణ రోడ్డు, నాలుగు మాడవీధుల్లో విద్యుత్ దీపాలు, అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్లు, శ్రీకాళహస్తి నుంచి పల్లం వరకు డబుల్ రోడ్డు ఇలా ఎన్నో పనులను చేశారన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. నేరుగా వారి ఖాతాల్లో డబ్బు జమ అయ్యేవిధంగా చేస్తున్నారని వివరించారు. ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రి చేసి రుణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించేవారిని నమ్మవద్దని హితవు పలికారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి బియ్యపు మధుసూదన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వయ్యాల కృష్ణారెడ్డి, రమణయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరమణయ్య, వెంకటకృష్ణయ్య, కృష్ణయ్య, చలపతి, వెంకీ, శివ, సురేష్, ఆనంద్, నరేంద్ర, అన్నయ్య పాల్గొన్నారు.


తాతతో ముచ్చటిస్తున్న బియ్యపు పవిత్రా రెడ్డి

సింహ వాహనంపై అగస్త్యీశ్వరుడి కటాక్షం

నారాయణవనం: మండలంలో సముదాయంలోని టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్త్యీశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి గ్రామ వీధుల్లో సింహ వాహనంపై ఉత్సవమూర్తులు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మేళ తాళాలు, కోలాటాల మధ్య స్వామి వారు హారతులను అందుకున్నారు. తొలుత ఉదయం ఆలయాన్ని సుప్రభాత సేవతో అర్చకులు నిత్యపూజాది కార్యక్రమాలను పూర్తి చేశారు. ఉదయం 10 గంటలకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. టీటీడీ ఏఈవో పార్థసారధి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, అర్చితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకల్, గౌతమ్ గురుకల్ తదితరులు పర్యవేక్షించారు. మంగళవారం సాయంత్రం అగస్త్యీశ్వరస్వామి హంస వాహనంపై ఊరేగనున్నారు.


సింహ వాహనంపై అగస్త్యీశ్వరస్వామి

పోలింగ్ ప్రక్రియపై అవగాహన ముఖ్యం



సత్యవేడు:మాట్లాడుతున్న ఏఈఆర్‌ఓ, బుచ్చినాయుడుకండ్రిగ: మాట్లాడుతున్న తహసీల్దార్

సత్యవేడు: ఈవీఎంల నిర్వహణతో పాటు పోలింగ్ ప్రక్రియపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఏఈఆర్‌ఓ రామాంజనేయులు కోరారు. సోమవారం పీఓ, ఏపీఓలకు పోలింగ్ ప్రక్రియపై అవగాహన కార్యక్రమం పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్లు ఎస్. ఈశ్వరయ్య, బాలకృష్ణ ఈవీఎంల పనితీరు గురించి వివరించారు. ఓట్లు ఎలా వేయాలి? వేసిన ఓట్లను ఎలా గుర్తించాలి? ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎం మొరాయిస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలి? మాక్ పోల్ చేసిన తరువాత సీల్ వేయడం..ఇత్యాది అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ రవి, ఏఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.


పిచ్చాటూరు: బీఎల్‌ఓలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్

పోలింగ్ కేంద్రాలపై సమీక్ష

బుచ్చినాయుడుకండ్రిగ: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో వసతులు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై బుధవారం తన కార్యాలయంలో తహసీల్దార్ పటాన్ మహ్మద్ అలీఖాన్ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణపై వందశాతం అవగాహన పెంపొందించుకోవాలని, బీఎల్‌ఓలు, అధికారులు ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వర్తించాలని కోరారు. ఈ నెల 21 నుంచి విభిన్న ప్రతిభావంతులు, 85 ఏళ్లు నిండిన వారు ఇంటి వద్దే ఓటు వేసే ప్రక్రియకు సంబంధించిన వివరాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు పాల్గొన్నారు.

బీఎల్వోల విధులపై అవగాహన

పిచ్చాటూరు: బూత్ లెవల్ అధికారుల(బీఎల్వో) విధులపై తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్ అవగాహన కల్పించారు. సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన బీఎల్‌ఓలకు సమావేశం నిర్వహించారు. పోలింగ్ రోజు, అంతకు ముందు బీఎల్‌ఓలు నిర్వహించాల్సిన విధులను ఆయన వివరించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థుల ప్రతిభ

నారాయణవనం: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ ఇంటర్ విద్యార్థులు ప్రతిభను కనబరచి ఉత్తమ మార్కులు సాధించారని హెచ్‌ఎం శశికళ తెలిపారు. తొలి ప్రయత్నంలోనే సీనియర్ ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో భావన (889), ద్వితీయ బైపీసీలో (856), జూనియర్ ఇంటర్ ఎంపీసీలో హేస్మిత (457), బైపీసీలో లోకేశ్వరి (402) మొదటి రెండు స్థానాలలో నిలిచారని శశికళ తెలిపారు.

ముద్ర రుణాల కోసం ఆందోళన

వరదయ్యపాళెం: స్థానిక స్టేట్ బ్యాంక్ అధికారులు ముద్ర రుణాలు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని నిరసిస్తూ సోమవారం మండల చేనేత కార్మికులు బ్యాంకు ఆవరణలో ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ.. మండలంలోని చేనేత కార్మికులకు ప్రభుత్వం ముద్ర లోన్లు మంజూరు చేసినప్పటికీ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ గ్రౌండింగ్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుల తరబడి బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా రుణాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. అర్హత ఉన్న వారి వివరాలను పరిశీలించి రుణాలను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని బ్యాంకు మేనేజర్ హామీ ఇవ్వడంతో ఆందోళనకు తెరపడింది. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు పృథ్వీ రవి, బుర్రా కృష్ణమూర్తి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


వరదయ్యపాళెం స్టేట్ బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న చేనేత కార్మికులు

సంక్షేమ పథకాలు పేదలకు వరం

- ఎన్నికల ప్రచారంలో బియ్యపు శ్రీవాణిరెడ్డి


కరకంబాడి పంచాయతీ ఇందిరానగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

రేణిగుంట: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు పేదలకు వరమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి అన్నారు. మండలంలోని కరకంబాడిలో సోమవారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. ఆమె ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని అభ్యర్థించారు. ఇంటింటా ఆమెకు మహిళలు కర్పూర హారతులు పట్టారు. ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగున్నరేళ్లలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాల బుక్‌లెట్‌ను పంచిపెట్టారు. ఆమె మాట్లాడుతూ ప్రజల మద్దతుతో గెలిచిన తన భర్త గెలిచిన నాటి నుంచి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటున్నారన్నారు. ఓ పక్క రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందిస్తూనే మరో పక్క తన సొంత నిధులతో సామాజిక కార్యక్రమాలను చేపట్టారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో కూడా అమలు కాని సేవా కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేశారన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు ఏ ఒక్కరూ తిరిగి చూడలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బొజ్జల కుటుంబం గెలిస్తే ఏ పని కావాలన్నా పక్క రాష్ట్రానికి ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. మండలం గత ఎన్నికల్లో అత్యధిక మెజారిటీనిచ్చిందని, మళ్లీ ప్రజలు నిండైన దీవెనలతో అత్యధిక మెజారిటీని అందించాలని కోరారు. ప్రజలు కూడా విజ్ఞతతో ఆలోచించాలని, ప్రలోభాలకు లొంగవద్దని కోరారు. జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు అందుకున్న పేద ప్రజలే వైఎస్సార్ సీపీకి స్టార్ క్యాంపెయినర్లని అన్నారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సి.తిరుమలరెడ్డి, రేణిగుంట ఎంపీపీ కలపాటి హరిప్రసాద్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గంగారి రమేష్, జువ్వల దయాకర్‌రెడ్డి, మన్యం శ్రీనివాసులురెడ్డి, గణేష్ రెడ్డి, శంకర్‌రెడ్డి, రహీం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ ఈశ్వరమ్మ, ఎంపీటీసీలు పీడీ శ్రావణి, కస్తూరి, కన్నయ్య, కృష్ణమూర్తి, నాటం సుబ్రమణ్యం, చంద్రశేఖర్, పీడీ బాబుయాదవ్, దిలీప్, పార్థసారథి, శివ, గురుమూర్తి, బొడుగు వెంకటాద్రి, రెడ్డిరాజు, రమేష్‌రాజు, జగదీష్, దీన, జయదేవ్, గురుస్వామి, సుబ్బరాయులు, ప్రసాద్‌రాజు, నాగరాజు, జాన్ బాబు, యోగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవమి ఉత్సవాలకు ముస్తాబు


పెద్ద పాండూరులోని సీతా సమేత కోదండ రామాలయం

వరదయ్యపాళెం: మండలంలో పెద్ద పాండూరులోని శ్రీ సీతా సమేత శ్రీ కోదండ రామాలయం శ్రీరామనవమి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు నవమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు నిరంజనాచార్యులు తెలిపారు. ఆలయానికి రంగులు వేస్తున్నారు. విద్యుద్దీపాలంకరణ చేస్తున్నారు. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా స్వామిఅమ్మవార్ల కళ్యాణం, గురువారం స్వామివారి పట్టాభిషేకం, శుక్రవారం వసంతోత్సవం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఆలయ ధర్మకర్త, విశ్రాంత రాష్ట్ర ఆర్ అండ్ బీ ఇంజనీర్ పరంధామరెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు.


ఆలయంలోని సీతా సమేత శ్రీ కోదండరామస్వామి

అగ్నిప్రమాదాలపై అవగాహన

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో సోమవారం అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కొన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా


ఏర్పేడు: ఎంపీడీఓ గిద్దయ్యకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

రేణిగుంట: మండలంలోని ఆత్తూరు సచివాలయ పరిధిలో ఉన్న 11మంది గ్రామ వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి వెన్నెలకు అందజేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు వలంటీర్లపై కక్షకట్టి గ్రామస్థాయిలో విధులకు దూరం చేయడంతో సామాన్యులు, వృద్ధులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉందన్నారు. దీంతో తామంతా రాజీనామా చేసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేస్తామని అన్నారు.

ఐదుగురు వలంటీర్ల రాజీనామా

ఏర్పేడు: టీడీపీ, జనసేన నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను నిరసిస్తూ మండలంలోని ఏర్పేడు సచివాలయ పరిధిలోని ఐదుగురు వలంటీర్లు తమ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఏర్పేడుకు చెందిన ఎస్.అరుణ, ఏ.అరుణకుమారి, కే.జ్యోతి, జి.భూలక్ష్మి, ఎం.శ్రీవిద్య సోమవారం స్వచ్ఛందంగా తమ రాజీనామా చేశారు. పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గిద్దయ్యను కలిసి అందజేశారు. వలంటీర్ల సేవలపై టీడీపీ అండ్ కో చేసిన అనుచిత వ్యాఖ్యలకు మనస్థాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు వారు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగనన్న విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.


రేణిగుంట మండలం ఆత్తూరులో రాజీనామా చేసిన గ్రామ వలంటీర్లు

పలువురిపై కేసుల నమోదు

ఏర్పేడు: మండలంలోని వెంకటాపురానికి చెందిన శిల్ప(22), సాయికుమార్ ప్రేమపెళ్లి చేసుకున్నారు. ఇది ఇష్టంలేని కుటుంబ సభ్యులు శిల్పపై దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

సైబర్ నేరంపై..

మండలంలోని ఇసుకతాగేలి గ్రామంలో యూనియన్ బ్యాంకు కరస్పాండెంట్ గాయత్రి బ్యాంకు ఖాతా నుంచి రూ.3,03, 000 లు సైబర్ నేరగాళ్లు స్వాహా చేయడంపై కేసు నమోదు చేశారు.

వ్యక్తిపై దాడి ఘటనలో..

మండలంలోని జంగాలపల్లెకు చెందిన వాసుదేవయ్య బీజేపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరినందుకు అదే గ్రామానికి చెందిన మురళి, రాము, ప్రశాంత్ కర్రలతో దాడిచేసి గాయపరిచారు. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏర్పేడు: మండలంలో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి రుయాలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని పెనుమల్లం గ్రామానికి చెందిన వెంకటేష్(30) ఈ నెల 7న ఆత్మహత్యకు యత్నించడంతో తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి దినట్లు సీఐ చెప్పారు.